క్లుప్తంగా

చదువే ఆభరణం



కొంకుదురులో విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్

బిక్కవోలు: చదువే మనిషికి ఆభరణమని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ తెలిపారు. గురువారం వేసవి సెలవులు అనంతరం విద్యార్థులు పాఠశాల వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల వద్ద ప్రార్థన సమయంలో పలు సూచనలు చేశారు. మండలంలోని అన్ని పాఠశాల తొలి రోజు తక్కువ సంఖ్య విద్యార్థులు హాజరయ్యారు.

షిరిడీసాయికి ప్రత్యేక పూజలు



పెద రాయవరంలో షిరిడీ సాయిబాబా

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

పెదపూడి: బడి ఈడులో పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను మండల విద్యాశాఖాధికారి సీవీవీ సత్యనారాయణ కోరారు. ఆయన గురువారం రామేశ్వరం, ఏపీ త్రయం, కుమారప్రియం, కరకుదురు తదితర గ్రామాల్లోని వీధుల్లో ఆయన, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పర్యటించారు. బడిఈడులో బడికి వెళ్లకుండా ఉన్న పిల్లల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాటాడారు. పాఠశాలల్లో చేర్పించాలని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో హాజరు శాతం ఎక్కువ నమోదు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు వివరించామన్నారు. ఈ ప్రక్రియ పది రోజులు పాటు నిర్వహిస్తారన్నారు.

వేమగిరిలో వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కడియం: వేమగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కోలా వెంకట్రాజు(కేవీఆర్) సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు గుండె, షుగర్, బీపీ, దంత, కంటి పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్లు రమ్య, విజయ్, యశ్వంత, వంశీకృష్ణంరాజు తదితరులు వైద్య సేవలు అందించారు. కోలా వెంకట్రాజు మనవరాలు డాక్టర్ రమ్య తన స్వగ్రామంలోని ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

వాసవీ క్లబ్స్ టీటీటీడబ్ల్యూ డైరెక్టర్‌గా రమేష్



సర్టిఫికెట్ అందుకుంటున్న రమేష్

రాజమహేంద్రవరం సిటీ: వాసవీ క్లబ్స్ టీటీటీ డబ్ల్యూ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా నగరానికి చెందిన మానేపల్లి రమేష్ నియమితులయ్యారు. సికింద్రాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్స్ వర్క్‌షాప్‌లో గోదావరి జిల్లాల నుంచి పలువురు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్న రమేష్ గురువారం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్, చైర్మన్ సుదర్శన్, పైలట్ ఫాకల్టీ గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

- ఇప్పటికే చేరిన వైనం
- నియోజకవర్గంలోని 173 స్కూళ్లలో 16,805 మంది విద్యార్థులు
- తొలిరోజు ఉత్సాహంగా తరగతులు



సీఆర్పీలకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓలు కుశలవ దొర, సుజాత



కోరుకొండ ఎంఈవో కార్యాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

మధురపూడి: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులందరూ ఉత్సాహంగా స్కూళ్లకు తరలివెళ్లారు. ఉపాధ్యాయులు వీరికి సాదరంగా ఆహ్వానం పలికారు. కొత్త తరగతులలోకి ప్రమోట్ అయిన విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. అలాగే కొత్త పాఠ్యపుస్తకాలు కూడా ఆయా పాఠశాలలకు చేరాయి. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం. రేపటి తరానికి మంచి భవిష్యత్తు దక్కాలంటే మంచి చదువు కావాలి. దానికి అనుగుణంగానే ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే స్టూడెంట్ కిట్లు పాఠశాలలకు చేరాయి.

నాణ్యమైన విద్య

పేదవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుంది. దానికనుగుణంగా గత ప్రభుత్వం పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. పాఠశాలలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దింది. బడి తెరిచిన రోజే విద్యా కానుక పేరిట పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూస్, బెల్టులు అందించింది. దీంతో పిల్లల చేరికలు కూడా గణనీయంగా పెరిగాయి.

నియోజకవర్గంలో..

రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలలో 173 పాఠశాలున్నాయి. బడులు తెరిచేనాటికి 16,805 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 1,31,450 పుస్తకాలు వచ్చాయి. మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో సంబంధిత పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు. అయితే విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, బెల్టులు, షూస్, సాక్సులు రావాల్సి ఉంది.

పిల్లల చేరికపై దృష్టి



పిల్లల చేరికపై దృష్టిపెట్టాం. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందించేందుకు చర్యలు చేపట్టాం. 2023- 24 పదోతరగతిలో మంచి ఫలితాలను సాధించాం. –కుశలవదొర, ఎంఈఓ, కోరుకొండ

మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారాయణ



మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను ఆరా తీస్తున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారాయణ

రంగంపేట: ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప విద్యా శాఖాధికారి ఈవీవీ ఎన్ఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ సూచించారు. పాత వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం ఆహారం అందుతుందా, ఆహార పదార్థాలు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనబడి నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన అదనపు గదులను, పరిసరాలను పరిశీలించి, కట్టడాలను నాణ్యతతో నిర్మించినందుకు ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎస్ దుర్గాప్రసాద్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు, అందించామని, మిగతా సామగ్రి ఈ వారంలో వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో ఆశించిన దిగుబడి

రాజానగరం: ప్రస్తుతం రైతులందరూ ఖరీఫ్ సాగులో నిమగ్నమయ్యారు. పొలంలో దుక్కులు చేసి నారు వేసేందుకు మడులు సిద్ధం చేస్తున్న వారు కొందరైతే, బోర్ల సాయంతో ఇప్పటికే ఆ పనులు పూర్తి చేసిన వారు మరికొందరు. అయితే ఏ పంటలోనైనా మంచి దిగుబడులు సాధించాలంటే విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, నారుమడి యాజమాన్యం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అనేక మెళకువలను చెబుతున్నారు. వీటిని పాటించడం ద్వారా రైతులు ఆశించిన దిగుబడులను అందుకోవచ్చని సూచించారు.

- నాణ్యమైన విత్తనాలను ఎంచుకున్నప్పటికీ విత్తనశుద్ధి చేసుకోవాలి. ఒక కిలో విత్తనాలకు కార్బండిజమ్ 25 శాతం, మాంకోజెబ్ 50 శాతంతో మిశ్రమ శిలీంద్రనాశిని 2 గ్రాములు చొప్పున (2 గ్రాముల శిలీంద్ర నాశిని ఒక లీటర్ నీటిలో కరిగించి ఒక కిలో విత్తనాలకు పట్టించాలి) నీటిలో నానబెట్టిన విత్తనాలకు విత్తనశుద్ధి చేయాలి.
- పొడి విత్తనం అయితే శిలీంద్ర నాశిని ఒక కిలో విత్తనాలకు 4 గ్రాములు వాడాలి
- నారుమడిని 10, 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి, చదును చేయాలి. ఐదుసెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లే ముందు ఒక కిలో, విత్తిన 12, 14 రోజులకు ఒక కిలో), ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కులో వేయాలి.
- విత్తన శుద్ధి చేసి మొలకలు వచ్చిన విత్తనాన్ని సెంటు మడికి ఐదు కిలోల చొప్పున చల్లాలి. పొలంలో జింకు లోపాన్ని గమనిస్తే 2 గ్రాముల జింకు సల్ఫేటు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- విత్తనాలు చల్లిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను సెంటు నారుమడికి 160 గ్రాములు వేయాలి. లేకుంటే మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరీపైరీపాస్ 2 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 10, 17 రోజులకు పిచికారీ చేయాలి.
- నారు తయారు కావడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి పలుచగా నీరు పెట్టాలి.

పాఠశాలల్లో సందడి



కరకుదురులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

పెదపూడి: పాఠశాల్లో సందడి వాతావరణం నెలకొంది. గురువారం ఉదయం ప్రభుత్వ పాఠశాలలు తెరవడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులకు ఈ ఏడాది సుమారు 50 రోజుల పాటు సెలవులు ప్రభుత్వం ప్రకటించింది. అయితే విద్యార్థులు తిరిగి కొత్తగా విద్యా సంవత్సరంలో అడుగుపెట్టారు. దీంతో పాఠశాలలు కళకళలాడాయి. అయితే వచ్చే సోమవారం నుంచి పాఠశాలలకు ఎక్కువ మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. మండలంలో 46 ప్రాథమిక, 14 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 3800 మంది విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థుల కిట్ల పంపిణీకి ఏర్పాట్లు



కరకుదురులో స్టూడెంట్ కిట్లను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న స్టూడెంట్ కిట్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని కాకినాడ విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కరుదురులోని పాఠశాలలో ఉన్న స్టూడెంట్ కిట్లు ఏ పాఠశాలకు ఎన్ని పంపించాలి? ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? అనే దానిని, ఆ కిట్లు కేటాయించే ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆ కిట్లు పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కరకుదురులో ప్రస్తుతం తరగతి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు వచ్చాయన్నారు. మిగిలిన సామగ్రి మరో రెండ్రోజుల్లో వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సీవీవీ సత్యనారాయణ, సీఆర్‌పీలు ఏశ్రీనివాసు, బీర విజయకుమార్, సీహెచ్ వెంకరమణ, మట్టా సత్యనారాయణ సిబ్బంది ఎస్‌ప్రకాశ్, వీరబాబు, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ దారిలో ఇక రైట్ రైట్..

- డీమార్ట్ సమీపంలో సర్వీసు రోడ్డు నిర్మాణం
- ప్రజల కష్టాలకు చెక్
- రాంగ్ రూట్‌లో ప్రయాణానికి మోక్షం



డీమార్ట్ సమీపంలో నిర్మించిన సర్వీసు రోడ్డు



ఐరన్ గ్రిల్ ఏర్పాటు పనులు చేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన డీమార్ట్‌కు ప్రజలు తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ అక్కడకు రాంగ్ రూట్‌లో వెళ్లడం వలన ప్రమాదాలతో పాటు, పోలీసులచే అపరాధ రుసుములు వసూలు చేసేవారు. దీంతో అక్కడకు వెళ్లే కొనుగోలుదారులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతితో డీమార్ట్ యాజమాన్యం సుమారు 800 మీటర్ల మేర రూ.2 కోట్లతో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టింది. అలాగే శరవేగంగా పూర్తి చేయడంతో కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పాయి.

రాంగ్ రూట్‌లో రాకపోకలు

హుకుంపేట జాతీయ రహదారి పక్కన డీమార్ట్‌తో పాటు నివాస గృహాలు, ఎంపీడీవో కార్యాలయం, విద్యాశాఖాధికారి కార్యాలయం, చిరు వ్యాపారాలు ఉన్నాయి. డీమార్ట్‌కు రోజూ వేలమంది వినియోగదారులు వెళతారు. వారందరూ హుకుంపేట సెంటర్‌కు మోరంపూడి జంక్షన్‌కు వెళ్లి తిరిగి రావాలంటే కిలోమీటరన్న దూరం అవుతోంది. దీంతో రాంగ్ రూట్‌లో డీమార్ట్‌కు వెళుతున్నారు. దీని వల్ల ఒక్కోసారి ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనాలకు పోలీసులు అపరాధ రుసుం విధిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

ఈ సమస్య పరిష్కారానికి డీమార్ట్ యాజమాన్యం సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. దానికి నేషనల్ హైవే ఆఫ్ అథారిటి ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి అనుమతులు తీసుకుంది. రూ.2 కోట్లతో సర్వీసు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు శరవేగంగా పూర్తి చేసింది. కేవలం సర్వీసు రోడ్డు, జాతీయ రహదారికి మధ్య ఐరన్ గ్రిల్ మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంది. సర్వీసు రోడ్డు పూర్తవ్వడంతో డీమార్ట్‌కు వచ్చే వినియోగదారులతో పాటు, ఎంపీడీవో, విద్యాశాఖాధికారి కార్యాలయానికి వచ్చే అధికారులు, ప్రజలకు, ఆ ప్రాంతంలో నివసించే వారికి ప్రయోజనం కలుగుతుంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సర్వీసు రోడ్డును డీమార్ట్ యాజమాన్యం పూర్తి చేసింది.

ఎంతో ప్రయోజనం

జాతీయ రహదారిపై హుకుంపేట సమీపంలోని డీమార్టు వద్ద సర్వీసు రోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. రాంగ్‌రూట్‌లో వాహన చోదకులు రావడం వల్ల ఇక్కడ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్డు నిర్మాణంతో ఆ సమస్య పరిష్కారమైంది.

– కొవ్వూరి ధర్మారెడ్డి, సామాజిక కార్యకర్త, హుకుంపేట

గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి యాప్సీ ప్రాజెక్టు



యాప్సీ ప్రాజెక్టు పత్రాలను వీసీ ఆచార్య పద్మరాజు నుంచి అందుకుంటున్న డాక్టర్ విజయనిర్మల

రాజానగరం: గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి (యాప్సీ) ఒక ప్రాజెక్టును మంజూరు చేసిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్స్‌లో ఒకటిగా ఉన్న 'నన్నయ' వర్సిటీలోని జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ పి.విజయనిర్మలకు ఇందుకు సంబంధించిన పత్రాలను గురువారం అందజేసి, అభినందనలు తెలిపారు. గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలుగా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎస్ఐటీ (తాడేపల్లిగూడెం), డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీలకు ఈ ప్రాజెక్టు కోసం యాప్సీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. 'వేస్ట్ టు వెల్త్' : పెక్టిన్ ఆగ్రో – వేస్ట్ నుంచి విలువ జోడించిన న్యూట్రాస్యూటికల్స్‌ని తయారు చేయడం, ఆహారం, ఫార్మా పరిశ్రమలో సంభావ్య అప్లికేషన్' అనే ప్రాజెక్టును రెండు సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తి చేయవలసి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇన్వెస్టిగేటర్స్‌గా డాక్టర్ విజయనిర్మలతోపాటు ఎస్ఐటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోలజీ అధ్యాపకులు డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీకి చెందిన డాక్టర్ డీఆర్ సలోమి సునీత వ్యవహరిస్తారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న మద్యం దుకాణాల సూపర్ వైజర్లు, సేల్స్ మేనేజర్లు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్ మేనేజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి వినతిపత్రం అందించారు. మద్యం షాపులను ఎత్తివేసి, పాత విధానంలో మాదిరిగా ప్రైవేటీకరణ చేస్తారని సోషల్ మీడియాలో, వివిధ పత్రికలలో ప్రచారం జరుగుతోందన్నారు. అదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులతో పాటు కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తమ విన్నపాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

రేపు బాబా మందిర వార్షికోత్సవం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిర 22వ వార్షికోత్సవం శనివారం జరగనుంది. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం వినాయకుడు, దత్తాత్రేయుడు, సరస్వతీమాత, సాయిబాబా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, సాయిబాబా మూలవిరాట్‌కి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8.15 గంటల నుంచి అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుంది. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మల్టీపర్పస్ సెంటర్ పరిశీలన

కడియం: కడియపుసావరంలో టీడీపీ, జనసేన నాయకుల అత్యుత్సాహంతో ధ్వంసమైన జక్కంపూడి రామ్మోహనరావు మల్టీపర్పస్ సెంటర్‌ను గురువారం దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో స్థానికులతో సమావేశమయ్యారు. ఘటన పూర్వాపరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఉద్దేశ పూర్వకంగానే మల్టీపర్పస్ సెంటర్ అద్దాలను పగుల గొట్టడంతో పాటు, అక్కడే ఉన్న ప్లాస్టిక్ ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని, ఫ్లెక్సీలను చింపివేశారని మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, స్థానిక నాయకులు సాపిరెడ్డి కామేష్ తదితరులు డీఎస్పీకి వివరించారు. ఇటువంటి ధ్వంసపూరిత కార్యకలాపాలను గ్రామాల్లోకి ఆహ్వానించడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పలు భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. అంతేగానీ ఉన్నవాటిని పగులకొట్టలేదన్నారు. సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కాగా ఘటనపై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు మల్టీపర్పస్ సెంటర్ నిర్వాహక కమిటీ సిద్ధమైంది.

ఆర్యాపురం బ్యాంకు వెబ్‌సైట్ పునరుద్ధరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ: ఖాతాదారుల సౌకర్యార్థం పునరుద్ధరించిన ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వెబ్‌సైట్‌ను ఆ బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ గురువారం ప్రారంభించారు. ఖాతాదారులకు అవసరమైన సమాచారమంతా బ్యాంకు వెబ్‌సైట్‌లో ఉంచామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.జగన్నాథరెడ్డి, డివిజనల్ సహకార అధికారి కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు, బ్యాంకు సెక్రటరీ కె.స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీపీ యాక్ట్ జిల్లా కమిటీ సమావేశం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో ఎంటీపీ యాక్ట్ 1971 జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ శిరీష, అనంతరావు, టి.పద్మజ మాట్లాడారు. సంతాన సాఫల్య కేంద్రానికి తప్పనిసరిగా ఎంటీపీ ధ్రువపత్రం ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అనుమతులు పొందిన ఆస్పత్రి నుంచి ప్రతి నెలా నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదిక తెప్పించి, దాని ఆధారంగా భ్రూణ హత్యలకు పాల్పడిన వారిని గుర్తించనున్నామన్నారు. జిల్లాలో ఎంటీపీ అనుమతికి వచ్చిన దరఖాస్తులను ఆయా ఆసుపత్రిలో సీనియర్ డివిజనల్ అధికారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.హరిబాబు, డిప్యూటీ డీఈఎంవో సత్యకుమార్ నల్లూరి, ఎంపీహెచ్‌వో నాగు, సీసీ.రాజు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన టెన్నిస్ శిక్షణ

ప్రకాశం నగర్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి టెన్నిస్ క్రీడా శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. అనంతరం నిర్వహించిన టోర్నమెంట్లో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్, టెన్నిస్ కోచ్ సత్య ప్రకాష్, సంఘం ఉపాధ్యక్షుడు భార్గవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్య శిక్షణ సంస్థ(డైట్)లో గురువారం జరిగిన డీఈఈ సెట్–2024 మొదటి దశ సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. దీనికి ఎనిమిది మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కళాశాల అలాట్‌మెంట్ లెటర్‌ను అందజేశామన్నారు.